కథ

## సి.హెచ్.వి. బృందావనరావు



# "నేను చేసింది తప్పేనా"


ఆ సంఘటన మాత్రం టౌన్లో పెద్ద సంచలనమే కలిగించింది. చాలామంది మగవాళ్ళు విని నివ్వెరపోయినారు. ఆడవాళ్ళు 'ఛీ' అని చీదరించు కున్నారు. పత్రికల వాండ్లకూ, టీవీ వాండ్లకూ కావల్సింది ఇలాంటి వార్తలే. వాండ్లకు న్యూస్ కావాలి. అదీ హాట్ హాట్ న్యూస్ కావాలి. ఇలాంటి వార్త దొరకాలి గాని టీ.వీ వాండ్లు మళ్ళీమళ్ళీ వేసి చూపించి, చెప్పి చెప్పి వాండ్ల సొంత కుతి తీర్చుకుంటారు.

ఇంతకూ జరిగిందేమిటంటే రాజమ్మ మొగుణ్ణి గొడ్డలితో తలమీద మోది ఛంపింది. ఆ తర్వాత ఏడ్చుకుంటూ ఇద్దరు పిల్లల్నూ వెంటబెట్టుకొని పోలీసు స్టేషనుకు వచ్చి జరిగినసంగతి చెప్పి స్టేషన్లో ఓ మూల కూర్చుండి పోయింది. మొదట రాజమ్మ స్టేషన్‌లోకి రావడం చూసి హెడ్ కానిస్టేబులు తలెత్తిచూసి మళ్ళీ దించుకొని సిగరెట్ దమ్ము లాగడంలో లీనమయిపోయాడు. ఇది ఏమీ డబ్బులు రాలే కేసు కాదని రాజమ్మ మొహం చూడగానేగ్రహించిన కానిస్టేబులు కూడా చెవిలో అగ్గిపుల్ల పెట్టి తిప్పుకుంటూ ! ఏం పని మీద వొచ్చినావమ్మా' అని అడిగాడు. కానిస్టేబులు అట్లా అడగ్గానే రాజమ్మ కొడుకూ కూతురూ అప్పటిదాకా సన్నగా ఏడుస్తున్నవాండ్లు పెద్దగా ఏడవడం మొదలుపెట్టారు.

"మా ఆయన్ను నేను జంపి నాను' అని నిశ్చలంగా చెప్పింది రాజమ్మ. కానిస్టేబులూ, హెడ్డూ ఉలిక్కి పడ్డారు. ఠక్కున లేచి నించుని "ఏం దేందీ" అని మళ్ళా అడిగారు.

'గొడ్డలీసుకొని నా పెనిమిటి తల బగలగొట్టినా' అని చెప్పి ఓ మూలకు బోయి కూచుంది రాజమ్మ.

'ఆ' అని నోరు ఎళ్లబెట్టారు ఈ పోలీసులు. హెడ్డు వెంటనే యస్సైకి ఫోను చెయ్యడానికి ఉపక్రమించాడు.




క్రమంగా విషయం తెలిసి పత్రికల వాళ్లు, టీవీల వాండ్లు, ఇంకా. పనీ పాటా లేక తమాషా చూసే జనమూ, నలుగు రైదుగురు రాజమ్మ పక్కింటివాళ్లూ స్టేషన్ ముందర చేరారు. హెడ్ కానిస్టేబులు రాజమ్మనడిగాడు 'ఎంతసేపైంది' అని. 'రాత్రి నడిజాముప్పుడు' అందిరాజమ్మ. హెడ్డు స్టేషన్ గోడగడియారం వైపు చూశాడు. పొద్దున్న ఏడు దాటింది. 'మరి ఇప్పటి దాకా ఎందుకు రాలేదు' అన్నాడు హెడ్డు.

రాజమ్మ ఏమీ మాట్లాడలేదు. 'శవం ఎక్కడుంది' అడిగాడు హెడ్డు. 'మా ఇంట్లోనే' అంది రాజమ్మ.

రాత్రి మందుకొట్టి పడుకుని ఇంకా లేవని యస్సైని ఫోన్లో బలవంతాన లేపి ఈ భోగట్టా అంతా అందించాడు హెడ్డు. ఫోను పెట్టేసి, కానిస్టేబుల్ వంక తిరిగి 'వొస్తున్నాడు' అని చెప్పి, రాజమ్మను ఇంటరాగేట్ చేయడం మొదలుపెట్టాడు.

'ఎంత కోపమొస్తే మాత్రం మొగుణ్ణి చంపుకుంటారా ఎవరైనా' అని అన్నాడు రాజమ్మవైపు చూస్తూ. రాజమ్మ మాట్లాడలేదు.

టీవీ వాండ్లూ పత్రికలవాండ్లూ రాజమ్మనూ, పిల్లలనూ ఫోటోలు తియ్యడానికీ మాట్లాడ్డానికీ ప్రయత్నిస్తుంటే, వాండ్లను బయటికి నెట్టి 'యస్సై వచ్చింతర్వాత ఆయన చెపితే అప్పుడు మాట్లాడుదురు గాని ఇప్పుడు బయ టుండండి' అని వికెట్ గేటు వేసేశాడు కానిస్టేబులు.

యస్సై వచ్చాడు. అంబులెన్సుకూ, ఫోటో గ్రాఫర్లకూ ఫోను చేసి హెడ్డునూ, కానిస్టేబుల్నూ, రాజమ్మనూ పిల్లల్నూ జీపులో ఎక్కించుకొని రాజమ్మ ఇంటికి బయల్దేరాడు.

రాజమ్ముండేది ఊరిబయట లేబర్ కాలనీలో ఓ గుడిశ. పోలీసు జీపు ఆ సందు గొందుల్లోంచి పోయి ఆ ఇంటి దగ్గరికి జేరేసరికి ఇంటిముందు పెద్ద గుంపు కూడి వుంది. తలుపివతల నిలబడి మెడలు రిక్కించి లోపలికి చూస్తున్నారు గాని, పోలీసు వ్యవహారం అనే భయంతో లోపలికి మాత్రం ఎవరూ పోలేదు.

కుక్కి మంచం మీద శీనయ్య శవం పడి వుంది. తల పగిలి వుంది. మంచం పట్టె మీది నుంచి, గుడ్డల మీది నుంచి నెత్తురు కిందికి కారి గడ్డ కట్టి వున్నది. ఈగలు అతని నోటిమీదా, తల గాయం మీదా, కింద నెత్తురుమీదా ముసురుకొని వున్నాయి. దృశ్యం భయంకరంగా వుంది. తండ్రి శవాన్ని చూడగానే పిల్లలిద్దరూ పెద్దగాఏడవడం మొదలుపెట్టారు. 'ఇష్, ఊర్కోండి' అని గదిమాడు యస్సై. పిల్లలు ఏడుపు శృతి తగ్గించారు.

హతుడు పెనుగులాడిన సూచవలేమీ కనిపించలేదక్కడ. 'నీ మొగాన నిప్పులు బొయ్య. మొగున్ని చంపుకుంటారంటనే' అని తిట్టింది ఓ ఆడమనిషి రాజమ్మను చూడగానే. 'వొళ్ళు మద మెక్కుండె. అదంతా ఎట్లబోవాల' ఒకతని వ్యాఖ్య.

'మొగోడన్న తర్వాత తాక్కుండా వుంటడా. ఎందరు మొగోళ్ళు తాగడం లేదు. దానికే సంపి పారెయ్యాల్నా' మరొకరి భూషితం.

'మొగుడొక దెబ్బేస్తే తప్పవుద్దా. పెళ్లమన్నది తిరగబడొచ్చునా. లోకంలో ఏ మొగుడూ పెళ్ళాన్ని గొట్టడం లేదో ? నాకు జూపిచ్చు' మరో స్త్రీ ఉవాచ.

ఎవరెన్నన్నా రాజమ్మ మాత్రం మాట్లాడ్డం లేదు. కేబుల్ టీవీ ప్రతినిధి మాత్రం రాజమ్మనూ, పిల్లలనూ, శవాన్నీ మార్చి మార్చి ఫోటోలు తీస్తూనే వున్నాడు. రాజమ్మను మాట్లాడించడానికి ప్రయత్నిం చాడు. రాజమ్మ ఏమీ మాట్లాడకపోయినా, కెమేరా లోకి చూస్తూ తన సొంత వ్యాఖ్యానం చెపుతూనే వున్నాడు.

శవపంచాయితీ, పోస్టుమార్టమూ అయి పోయినాయి. రాజమ్మను పోలీసులు కోర్టులో హాజరుపరిచారు. రిమాండుకు ఆదేశించింది కోర్టు. ఎంత పేదలయినా కేసు నుంచి తప్పించు కోడానికి ప్రయత్నాలు చేసుకోవల్సిందే గదా. రాజమ్మ తల్లీ అన్నలూ వచ్చారు. ప్రయత్నించి రాజమ్మకు బెయిలు సంపా యించారు. రాజమ్మ పిల్లలను తమతో తీసుకుపోయినారు.

✿ ✿ ✿

శ్రీరామమూర్తి ఆ టౌన్లో ఏ పేరూ మోయని చిన్న ప్లీడరు. ఒక పెద్ద పేరున్న ప్లీడరు దగ్గర కొన్నాళ్లు జూని యర్గా చేసి కొంచెం అనుభవం గడించు కొని ప్రస్తుతం స్వంతంగా ప్రాక్టీసు నడుపుకుంటున్నాడు. యువకరక్తం ఇంకా కొంచెం పొంగులోనే వుంది కాబట్టి పాపభీతీ, న్యాయమూ లాంటి వాటికి ఇంకా విడాకులు ఇవ్వలేదు అతను.

ఉదయం కోర్టుకు హాజరై, ఇంటికి వచ్చి భోం చేసి, కొంచెంసేపు నిద్రపోయి లేచి, కాఫీ త్రాగి ఆఫీసు గదిలో కూచుని వుండగా వచ్చింది రాజమ్మ ఆయన దగ్గరికి. ఆమెతో పాటు ఆమె ముసలి తల్లి గూడా వచ్చింది.

నలభై ఏళ్ళుంటాయి రాజమ్మకు. కాయకష్టం చేసిన శరీరమైనా గత పదిరోజులుగా జరిగిన ఘటనలతో బాగా క్రుంగిపోయి దిగులు పోత పోసినట్లున్నది రాజమ్మ. తైల సంస్కారం జరిగి ఎన్ని రోజులైందో ఆమె తలకు. ముతకచీరా, రెవికా, ఓ పుస్తెల తాడు మెడలో, కాళ్ళకు మెట్టెలూ, రెండు చేతులకూ మట్టి గాజులు.

'దండాలు బాబూ' అంది రాజమ్మ అక్కడే వున్న బెంచీమీద కూలబడి. 'నువ్వా రాజమ్మా' అన్నాడు శ్రీరామమూర్తి. ఆశ్చర్యపోయింది రాజమ్మ. 'నా పేరు నీకెట్టా దెలుసుబాబూ' అని, అంతలోనే సర్దుకొని 'ఎందుకుదెలియదులే బాబూ, ఇప్పుడు నా పేరు తెలియనోండ్లెవరున్నారు దేశంలో. మొగుణ్ణి జంపిన దొంగ ముండ యిదేనని ఫోటోలు పేపర్లో యేసిరి. టీవీలో గడియగడియకూ శప్పలేక సచ్చిరి. నీకు మాత్తరం నాపేరు తెలియకుండ యట్లుంటది' అన్నది రాజమ్మ.

నవ్వాడు శ్రీరామమూర్తి.

'బాబూ, నాకేసు నువ్వు వోదించాల' అంది రాజమ్మ. శ్రీరామమూర్తి ఏమీ మాట్లాడలేదు.

ఈ పచ్చిముండ (పక్షిముండ) కేసు వాదిస్తే దమ్మిడీ రాల్దని నువ్వనుకుంటున్నవేమో నాకు తెల్దు బాబూ. నిజమే. నీకు ఒక్కొ కేసుకు యేలు యేలు రాల్తయి. నాకాడ ఏముందిపైన ఆకాశమూ, కింది బూమీ. రామ్మూర్తి బాబు బీదా బిక్కికి సాయం జేసెటోడనీ, కేసు కోసం వచ్చేటోళ్లను పీక్కతినే ప్లీడరు గాదనీ, నీ కాడికే బొమ్మని ఆళ్లూ యీళ్లూ చెపితే నీ కాడికొచ్చినా. నన్ను ఓ గట్టున బడేస్తావో, శివో ముండా అని యుల్లగొడ్తవో నియ్యిష్టం. అయినా వూరికే చెయ్యొద్దులే బాబూ' అని మెళ్లోంచి పుస్తెలతాడు

దీసి శ్రీరామ్మూర్తికి ఎదురుగా టేబులు మీద పెట్టి 'ఇంక ఇయ్యి నా మొళ్ళో ఉండేమి, లేకేమి అసలోడే బొయ్యినంక. అన్నీ అమ్మక తిన్నం గాని పుస్తెల్లో ఆ కూసింత బంగారమ్మాత్తరం అట్టనే వుంచినా బాబూ. మొగుడు జచ్చినంక జెయిల్లోకి బోతి. ఇయ్యాల్నే బయటికొస్తి. అందుకని మెట్టెలూ, గాజులూ గూడా తియ్యాలా. అయినా, అయ్యున్నప్పుడు నాకు జేసిన మేలేంది. ఇప్పుడు తియ్యకపోతే వొచ్చిన కీడేంది గాని, బాబూ నువ్వునాకు ఊరికనే సెయ్యొద్దు. ఆ పుస్తెలు నువ్వే తీసుకో. అయ్యేంతవుతాయో నాకు తెల్దు. సాలకపోతే బతికినన్ని రోజులూ నియ్యింట్లో పాశిపని జేస్తా. అంట్లు దోమతా – నన్నెట్టైనా బయట బడెయ్. నాయంటి ముండ లోపలున్నా ఒకటే బయటున్నావకటే. నేనేందో బావుకుందామనో, సోకుల్జేసుకుని కులుకుదామనో బయటబడదామను కోడంలా బాబ్బాబు. ఇద్దరు పసి పచ్చులున్నారు. బాబూ నాకు. కొడుకూ, కూతురూ. నేన్లేకపోతే ఈ యమలోకంలో వాళ్ళు బతకలేరు బాబూ. ఈ రాబందుల దెబ్బల్నించి తప్పించుకోలేరు బాబూ. యిసప్పురుగులను గాసుకోలేరు బాబూ. అందుకే ఆల్లకోసం నేను బయటికి రావాల. నువ్వేం జేస్తవో నాకు దెలియదు. నా కాడుండే ఆ పుస్తెలు రెండూ నీకాడ బెట్టినా. నేనొచ్చి నీ కాళ్ళకాడ గూసున్నా. ఇంక నియ్యిష్టం' అంది రాజమ్మ రెండుచేతులూ జోడించి నొసటికి ఆనించి.

తనముందు కూచున్న ఆ దరిద్ర దేవత మెళ్లోంచి తీసి టేబులు మీద పెట్టిన పుస్తెల వైపు చూశాడు శ్రీరామ్మూర్తి. భర్త పోయాడు. తినడాని కేమైనా వుందో లేదో తెలీదు. ఇద్దరు పిల్లలు. మనిషి చూస్తే దిష్టిబొమ్మలా వుంది. కేసేమౌతుందో తెలీదు. మర్డర్ కేసు. గెలవకపోతే పిల్లల గతేమవుతుందో చెప్పలేం. పక్కనున్న ముసిల్ది రాజమ్మ తల్లి గామాల. కడుపు తీపి ఆపుకోలేక వెంట వచ్చినట్లుంది. అసలేమి జరుగుతున్నదో ఆమెకు ఆకళింపౌతున్నదో లేదో. దిష్టిబొమ్మలా వున్న రాజమ్మనూ, దిష్టిబొమ్మ తల్లిలా వున్న రాజమ్మ తల్లినీ చూస్తే శ్రీరామమూర్తికి గుండెల్లో పీనల్‌కోడూ, క్రిమినల్ ప్రొసీజర్ కోడూ, ఎవిడెన్స్ ఏక్టులూ స్పృశించని తడి భాగమేదో కొంచెం కంపించి నట్లయింది.

'ఇంతకూ నీ భర్త నెవరు చంపారు రాజమ్మా' అని అడిగాడు. 'అదేంది బాబూ అట్టా అడుగుతరు. నేనే చంపినా' అంది రాజమ్మ. 'ఎందుకు చంపావు. తాగి వచ్చి గొడవ చేసేవాడా' అడిగాడు శ్రీరామ మూర్తి. 'తాగేది తాగేదే. తాగి నడిజాము కాడ వస్తడు. కూలి డబ్బులు సారాయి కొట్లో కాళీ జేసుకుని వస్తడు. వొచ్చి నానా గొడవా జేస్తడు. కాస్త తిని దున్నపోతోలె నిద్దరబోతడు. ఇది రోజూ వుండే బాగోతమే' అన్నది రాజమ్మ తను శీనయ్యను చంప డానికి వాడి తాగుడు కారణం కాదని చెప్పకనే చెపుతూ.

'మరి, నిన్ను కొట్టేవాడా' అని అడిగాడు శ్రీరామమూర్తి.

'వాడు నన్నేం గొడ్తడు. తాగిన మైకం మీద వున్నప్పుడు కొడతా, తంతా అని కేకలేస్తడు గాని, నేను గట్టిగ రెక్క బట్టుకుంటే కదల్లేనోడు. నన్నేం గొడతడు' అంది రాజమ్మ.

రామ్మూర్తికి ఏమీ అర్థం కాలేదు. శీనయ్య తాగేదీ నిజమే. గోల చేసేదీ నిజమే కానీ అది కారణం కాదు అంటున్నది రాజమ్మ. ఇక ఫిజికల్ అస్సాల్ట్ అందామా అంటే అది అసలే కాదంటున్నది. మరి గొడ్డలితో కొట్టి చంపేంత కారణం ఏముం టుందో అతనికి అర్థంకాలేదు. అయితే ఆ రోజు ప్రత్యేకంగా ఏమైనా జరిగుండాలి. రాజమ్మనెలా రక్షించాలో అతనికి తోచడం లేదు.

'చూడు రాజమ్మా, డాక్టరు దగ్గరికి వచ్చి నపుడూ, ప్లీడరు దగ్గరికి వచ్చినపుడూ ఏసంగతి దాచకుండా చెప్పాలె. మరి నువ్వు నీ భర్తనెందుకు చంపావో నాకు కారణం చెప్పకపోతే ఎట్లా? అన్నాడు శ్రీరామమూర్తి.

రాజమ్మకు కండ్లనిండా నీళ్ళు వచ్చాయి. ఓ రెండు నిమిషాలు ప్లీడరు వంక చూసింది. ఏదో భయంకరమైన బాధతో మెలితిరిగిపోతున్నట్టు ఆమె మోహం నిండా దిగులు.

'తప్పుద్దా బాబూ. సెబుతా. కడుపు సించు కుంటే కాల్లమీద బడద్దంటారే – అట్టా అయింది బాబూ నా బతుకు. ఏం జెప్పాలో ఏం జెయ్యాలో తెలీదంలా. అయినా గూడ సెప్పాల గదా బాబూ. మాకు పెళ్లయి పదేనేండ్లయింది. వోడు మంచోడే. పెండ్లయినంక ఏడెనిమిదేండ్లు బాగానే వున్నం. ఆ తర్వాతనే వాడికి తాగుడు అలవాటయింది. నేనూ ఏమీ బట్టించుకోలా. తాగితే తాగినాడులే, యంత మంది తాగటంలా అనుకున్నా. ఇద్దరం కూలి జేసు కుంటా బతకతా వుండాము. ఇద్దరు పిల్లలు బుట్టిరి. వాడు కూలి డబ్బులన్నీ సారాయి కొట్లో ఇచ్చి పూటుగా దాగి రేత్తిరి యే పదకొండు గంటలకో ఇంటికొచ్చేవాడు. పిల్లలు ఎక్కొస్తుండిరి. నా ఒక్కదాని కూలి యట్టాసరిపోద్ది నువ్వే జెప్పుబాబూ. అంతకు ముందు పైసా యియ్యకపోయినా వూరుకుండేదాన్ని. ఇప్పుడు కూలి డబ్బులన్నీ సారాయికి బొయ్యొద్దు. ఇంటోకి గావాల అని అడగబడితిని. అయినా ఇచ్చేవాడు గాదు. పైగా తంతాను పొడస్తాను అని వొంటి కాలిమీద లెగిసేవోడు అయినానేన్ం బట్టించు కోలా'. అని ఆగింది రాజమ్మ. ఓ నిమిషం ఊరుకొని, ఏదో చెప్పటానికి మనసురాని సంగతి చెపుతున్నట్టు మోహం బెట్టి, కొనసాగించింది. 'ఈ తాగుడంత




డా॥ ఎన్.గోపి రచించిన 'గోపి నానీలు' (నన్హేముక్తక్) హిందీ అనువాద గ్రంథాన్ని హైదరాబాద్‌లోని ఆంధ్రప్రదేశ్ హిందీ అకాడమీలో డా॥ సి.నారాయణరెడ్డి ఆవిష్కరించారు. చిత్రంలో కవి గోపి, అనువాదకుడు ఆచార్య టి. సత్యనారాయణ, అకాడమి అధ్యక్షులు డా॥ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, హిందీ మిలాప్ సంపాదకుడు శ్రీరామ్ జీసింహ 'ఉదయన్', ప్రొఫెసర్ టి.వి.కట్టమణి, ప్రొఫెసర్ టి. మోహన్‌సింగ్ ఉన్నారు.

మాదర్సేదుది మరోటి లేదు బాబూ. పగులంతా కట్టంజేసి సందేళకు ఓ సుక్క ఏసుకుంటే ఏంలే అని అనుకునే దాన్ని గాని శీ-యీ తాగుడు దురమార్గపుది బాబూ. 'అని కండ్లనిండా నీళ్ళు నింపుకుని - వాండ్ల అమ్మతో 'అమ్మా, నువ్వట్టా బైట అరుగుమీద గూసోపోయే అనింది. ఆమె లేచిపోయాక శ్రీరామ మూర్తి వైపు తిరిగి 'ఇట్టాంటియన్నీ దిక్కూ దివాణం లేని ముండను నాకే రప్పియ్యాలా ఆ యంకట రమణ మూర్తి' అని చీరకొంగుతో కళ్ళు ముక్కూ తుడుచుకొని కానసాగించింది రాజమ్మ. 'ఒకరోజు తాగొచ్చి నాతో గొడవపడినాడు బాబూ. ఆ రోజు ఒక రాత్రప్పుడు నేను లేచి చూస్తే - నువ్వ నమ్మువు బాబూ - ఆ తాగిన మైకంలో నా కూతురు గుండెలమీద సెయ్యేసి రుద్దుతున్నాడు బాబూ ఆ యదవ. వాడికి సొంత కూతురే బాబూ మొన్న సంకురాతిరికి పదమూడో యేడొచ్చింది బాబూ ఆ పిల్లకు. నాకు నెత్తురు వుడికిపోయినాది బాబూ. నేను లేచి వాణ్ణి యిదిలించి పారేసి, సీపురు దీసుకొని ఒకటేసినాను బాబూ. వాడు దండం బెట్టి, తాగుడు మైకంలో వొళ్లు తెలియలేదే అని శంపలేసుకున్నాడు బాబూ. పోనీలే తాగినోడికి వోవీ వొరసా యేందెలు సుద్దిలే అని అనుకున్నాను గాని, మళ్ళీ ఇంకోపాలి వాడు అట్టానే జేస్తుంటే జూసినా బాబూ. ఈ సచ్చినోడికి యిదేం పాడు బుద్దిరా బగమంతుడా అనుకుంటా నాలో నేనే కుల్లి కుల్లి సస్తావుండా బాబూ. యీడసలే తాగుబోతోడు. మంచీ సెడూ కలదెలుసుకొనే బుద్ది బొత్తిగా బోయింది వాడికి. యీ పిల్లమీద కన్ను బడ్డది. ఇంటో నేనుం టాను - వుండను - యేం జెయ్యాల్రా యంగట రమణ మూర్తీ అని గోర దుక్కంలో మునిగిపోయినా బాబూ. యీ ముండకొడుకు నించి యీ పిల్లను ఎట్ట రచ్చించుకోవాలో తోచలేదు బాబూ. పెళ్ళి జేసి పంపి ద్దామా అంటే పదమూడేళ్ళు గూడా లేవాయ. నాకాడ నువ్వ సెప్పు దీసక్కొట్టినా పైసా లేదాయె. పెండ్లంటే మనుము ఇప్పటికిప్పుడు గుదర్తదా. కట్నం గావాలాయ. మొల్తాడు గట్టిన మొగోడనంగనే పదేలిస్తవా పదేనేలిస్తవా అని అడుగు తారాయ. అయినా ఆ పసిదానికి అప్పుడే పెండ్లేంది బాబూ - నా కొకటే ఆలోశన బాబూ యీ ముండ కొడుకు బారి నుంచి పిల్లనెట్ట గాపాడు కోవాలా అని ఆ రోజు నేను పక్కింటికి బొయ్యొచ్చేలోగా పిల్లను బట్టుకుని అదుముకుంటుండె బాబూ. పసిపిల్ల ఏం జేస్తది, అయ్య దగ్గరికి దీసు కున్నళ్ళే అనుకుంటది గాని దాని కప్పుడే యేం దెలుసుబాబూ అది నా కండ్ల బడంగనే నాకు కడుపులో బాదా కోపమూ ఉరికొచ్చినాయి బాబూ. నన్ను జూసి వాడు పిల్ల నొదిలిపెట్టి బైటికి బోయినాడు బాబూ. అంతే నేనింకేం జెయ్యాల్లో నాకు అర్థమైపోయింది బాబు. ఆ రాత్రే వాడు నిద్దరబోతుంటే గొడ్డలి దీసుకుని నా బలం కొద్దీ ఒక్కటేసినా. ఇంకేం జెయ్యమంటవు బాబూ నన్ను. నేం జేసింది తప్పో రైటో పైన యంగట రమణమూర్తికి దెల్సు - కింద నాకు దెల్సు. నువ్వు చెప్పు బాబూ, నేను జేసింది తప్పంటావా?' అని వలవలా ఏడ్చింది రాజమ్మ. ఆ ఏడుపు ఆడమనిషి ఏడిచినట్లు లేదు. గర్భంలో వున్న జింక కడుపుమీద చిరుతపులి పంజాతో కొడితే, అది గిల గిల్లాడి పెట్టిన కేకలా వుంది గాని, ఏడుపులాగా లేదు.

శ్రీరామమూర్తి మ్రాన్పడిపోయాడు. నివ్వెర పోయాడు. చాలసేపు మాట్లాడలేకపోయాడు. పేదరికం, ఆకలి, తాగుడు, మైకం, తగాదాలు, కేకలు, కామం, పెడబొబ్బలు, గొడ్డళ్ళు, నెత్తురు, కోర్టులు, శిక్షలు, జెయిళ్ళు, బెయిళ్లు, దుఃఖము, బాధా - వీటన్నిటి కలగలుపయిన అధోజగద్వాసుల జీవితం లోని, తనకు తెలీని మరో భయంకర పార్శ్వాన్ని అంత దగ్గర్నించి చూసిన శ్రీరామమూర్తి కంపించి పోయినాడు.

టేబులు మీదినుంచి పుస్తెలు తీసి రాజమ్మ చేతికి ఇచ్చి 'నువ్వు నాకేమీ ఇవ్వొద్దులే రాజమ్మా, నా చేతైనంత వరకూ పోరాడి నిన్ను జైల్లోకి పోనీ కుండా ఉండేందుకు ప్రయత్నిస్తా' అని మాత్రం అనగలిగాడు.

## ☺ హాస్య చినుకులు ☺

"మీ ఆఫీసులో పెళ్ళయిన వాళ్ళకే ఉద్యోగాలు ఇస్తారా ? ఎందుకు?" ఆశ్చర్యంగా అడిగాడు ఇంటర్వ్యూ కొచ్చిన అభ్యర్థి.

"పెళ్ళయిన వాళ్ళకి సహనం ఎక్కువ ఉంటుంది. అప్పటికే అడ్డమైన తిట్లకీ అలవాటు పడి సిగ్గు పడ్డం మరచిపోతారుగా అందుకని" చెప్పాడు మేనేజర్.

☺ ☺ ☺

"ఈ ఫోటో మావారి పెళ్ళికి ముందు తీయించుకున్నదని అంత బాగా ఎలా కనిపెట్టావు?" ఆశ్చర్యంగా అడిగింది సూర్యకాంతం.

"ఆ ఫోటోలో మీ వారు నవ్వుతూ కళకళలాడుతుంటేనూ..."

☺ ☺ ☺

"భార్య : ఏమండీ మీ మిత్రుడు పెళ్ళి చేసుకుంటున్న అమ్మాయి మంచిది కాదు. వెళ్ళి వెంటనే ఆపండి.

భర్త : ఊహూ ! నేను ఆపను !

భార్య : ఎందుకు ?

భర్త : వాడేమన్నా నా పెళ్ళి ఆపాడా !

☺ ☺ ☺

టీచర్ : పట్టభద్రుడు అంటే ఎవరు?

విద్యార్థి : పనికి రాకపోయినా డిగ్రీ పట్టాలను భద్రంగా దాచుకునేవాడు కావచ్చు సార్.....

☺ ☺ ☺

మేష్టారు : 'సబ్బు'ను వాడటం మొదట ఎక్కడ మొదలుపెట్టారు?

రాము : బాత్‌రూమ్‌లోనండి.

☺ ☺ ☺

పెళ్ళిచూపుల్లో పెళ్ళికూతురిని చూడవచ్చినవారు పాటపాడమన్నారు.

"అబ్బ ! నాకు సిగ్గండీ ! మీరందరూ అవతలకి వెడితే పాడతా" అంది పెళ్ళికూతురు.

"పర్లేదమ్మా సిగ్గెందుకు, అందరూ మనవాళ్ళే ! పాడు అన్నారు పెద్దలు.

"ముందు నువ్వు పాట మొదలెట్టవే అక్కయ్య ! వాళ్ళే వెడతారులే అవతలకి" అన్నాడు పెళ్ళికూతురు చిన్నతమ్ముడు అమాయకంగా.

☺ ☺ ☺

- వై.కె.మూర్తి